సంక్రాంతి శుభాకాంక్షలు



చిలకలూరిపేట: సంక్రాంతిని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి అంటేనే రైతులు, పల్లెలు గుర్తుకు వస్తాయని, పాడి పంటలతో రైతులు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



వెల్లటూరు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బొల్లాపల్లి: జననీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరు, వడ్డెంగుంట, గుట్లపల్లి, సరికొండపాలెం, సీతారామపురం తండా తదితర గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. ఆడపడుచులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.చినవీరయ్య, ఎంపీటీసీ సభ్యుడు జి.చినవెంకయ్య, డి.గోవిందునాయక్, ఖాజ్జయం లక్ష్మీనారాయణ, బత్తి గురవయ్య, మట్టి రాజయ్య పాల్గొన్నారు.

రంగవల్లులు తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీక



ముగ్గుల పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రంగవల్లులు తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం పట్టణంలోని పెద్దచెరువులో గోపిరెడ్డి చారిటీస్ 25వ వార్డు ఇన్‌చార్జి చిన్ని వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి విజేతకు స్మార్ట్ ఫోన్, ద్వితీయ విజేతకు జ్యూసర్ మిక్సీ, తృతీయ విజేతకు ట్రావెలింగ్ ట్రాలీ అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ వసంతరాయ, డాక్టర్ శ్వేత, చిన్ని సుమలత, కొత్తమాసు సుజాతలక్ష్మి, మురారిశెట్టి పద్మ, యక్కల సుజాత వ్యవహరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నిడమానూరి సురేంద్ర, ఆల్ ఇండియా రైస్ మిల్లర్ల ఉపాధ్యక్షుడు ఊర భాస్కరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు, ప్రవల్లికా సత్యం, చేగు వెంకటేశ్వరరావు,సాంబశివరావు పాల్గొన్నారు.

భోగిమంటలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం



యడ్లపాడులో భోగిమంటల వద్ద తెలంగాణ ఎమ్మెల్యే గాంధీ

యడ్లపాడు: భోగాభాగ్యాలను ఇచ్చే భోగి పండుగ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వేకువజామునే ప్రారంభమైంది. పాత కలప వస్తువుల్ని అందులోనే పడేసి సంక్రాంతి మూడో రోజుల పండుగను స్వాగతం పలికారు. పుడమి బిల్డర్స్ గ్రూప్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగమంటల ఉత్సవంలో తెలంగాణ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పాల్గొన్నారు. భోగిమంటల్ని రాజేసి అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, శ్యామలాదేవి, ముత్తవరపు సురేష్‌బాబు, అరుణకుమారి, డాక్టర్ భార్గవిచౌదరి, పృథ్వీ దంపతులతో పాటు ముత్తవరపు రామారావు, పద్మారావు, జరుగుల శంకరావు, నంబూరి శ్రీనివాసరావు, విజయ్ పాల్గొన్నారు.

ఈపూరు: భోగి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన ఈపూరుతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేసి పండుగను జరుపుకున్నారు.

నాదెండ్ల: మండలంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తొలిరోజు భోగి పండుగను ఆదివారం నిర్వహించారు.

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గ వ్యాప్తంగా భోగి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు వేసి సంప్రదాయాన్ని చాటారు. పట్టణంలోని స్థానిక బార్ అసోసియేషన కార్యాలయంలో న్యాయవాదులు భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో ఏజీపీ ఎం.ఎస్.ప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయచౌదరి, మున్సిపల్ స్టాండ్ కౌన్సిల్ కర్నాటి చెన్నకేశవరెడ్డి, పి.జె.లూకా, ఎం.ఎలీషా బాబు పాల్గొన్నారు.

శావల్యాపురం: మండలంలోని అన్నీ గ్రామాల్లో భోగి పండుగ వేడుకలు ప్రజలు సంస్కృతి సంప్రదాయాలు నడుమ వైభవంగా ఆదివారం జరుపుకున్నారు.

బొల్లాపల్లి: భోగిని సంప్రదాయబద్ధంగా మండల ప్రజలు నిర్వహించారు. వెల్లటూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత కోలాట ప్రదర్శన, బ్రహ్మంగారి నాటకం ఏర్పాటు చేశారు.

రొంపిచర్ల: మండల ప్రజలు భోగి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే లేచి భోగి మంటలు వేసి పాటలు పాడుతూ పండగను ప్రారంభించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు

కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని కొప్పుకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని గణేషునిపాలెం గ్రామంలో టీడీపీకి చెందిన వంద కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే బొల్లా పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న వారికి ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వీరంతా పార్టీలో చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇటీవల కాలంలో నూజెండ్ల మండలంలోని టీడీపీ కంచుకోటగా ఉండే గురప్పనాయుడిపాలెం, టి.అన్నారంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని వందల మంది టీడీపీ కార్యకర్తలు పార్టీలోకి చేరడం శుభ పరిణామమని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలను ఆకర్షిస్తున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి మరలా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన కార్యకర్తలకు తమ కుటుంబ సభ్యులుగా భావించి అన్ని విధాలా ప్రాధాన్యతనిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ కోలా వీరాంజనేయులు, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల, డీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ ప్రాంగణం వేదికగా మారింది. 1974 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఇక్కడ విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు ఒక చోట చేరి వారి గత స్మృతులు నెమరవేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని ఆత్మీయత పంచుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన మల్లెల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రస్తుత వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆర్థిక సాయంతో కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సంఘ కార్యదర్శి తోట కిషోర్ పాల్గొన్నా రు.



గణపవరం జెడ్పీ హైస్కూలులో సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గణపవరం జెడ్పీ హైస్కూలులో..

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. 2012-13 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు సమావేశమయ్యారు. 150 మంది విద్యార్థులకు గాను వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని మురిసిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థులతో సరదాగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



యడ్లపాడు లూథరన్ పాఠశాల 1996-97 బ్యాచ్ విద్యార్థులు

జ్ఞాపకాల జడిలో తడిసి మురిశారు

యడ్లపాడు: పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలుసుకున్నారు. ఇందుకు యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాల వేదికగా మారింది. పాఠశాలలో 1996-97, 2001-02, 203-04 విద్యాసంవత్సరాల్లో పదో తరగతి అభ్యసించిన మూడు పూర్వవిద్యార్థుల బృందాలు వేర్వేరుగా ఆత్మీయ సమావేశాల్ని నిర్వహించాయి. దీంతో పాఠశాల ప్రాంగణం పూర్వవిద్యార్థులతో కళకళలాడింది. బ్యాచ్‌ల వారీగా విడిపోయి తమతోటి స్నేహితులను పరిచయం, నాడు చదువుకున్న తరగతి గదులు, కూర్చున్న బెంచీలు, ఆడుకున్న ఆటలు, ఆటపట్టించిన సంఘటనలు గుర్తు చేసుకుని మురిపిపోయారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువుల్ని ఆహ్వానించి నూతన వస్త్రాలు, మెమోంటోలు సమర్పించి ఘనంగా సత్కరించారు.

వైభవంగా మకర జ్యోతి వేడుకలు

శావల్యాపురం: స్థానిక శ్రీకనకదుర్గామ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలోఅయ్యప్ప స్వామి మకర జ్యోతి ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాలా నరసింహారావు మాట్లాడారు. మకర జ్యోతిని గ్రామవాసి ఆర్యవైశ్య సంఘం నాయకులు సనిశెట్టి వెంకట గురువీరాంజినేయులు లీలావతి దంపతులు జ్యోతి ప్రజ్వలన ఘనంగా నిర్వహించారు.

బోయపాలెంలో పెంకుటిల్లు దగ్ధం

యడ్లపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పురాతన తాటివాసాలతో ఏర్పాటు చేసిన పెంకుటిల్లు దగ్ధమైంది. మండలంలోని బోయపాలెం ఏటీఎం సమీపంలో ఆకి వీరబ్రహ్మానికి చెందిన ఇంటిని ప్రత్తిపాడుకు చెందిన చిన్న నరేష్ కొంతకాలంగా అద్దెకు తీసుకుని కుటుంబంతో పాటు అందులోనే షామియానాకు చెందిన సామన్లు పెట్టుకుని అద్దెకు ఇస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి సమయంలో పెంకుటింటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక అధికారి ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.5 లక్షల విలువైన ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

చిలకలూరిపేట: గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని న్యాయవాది గోరంట్ల నారాయణ పేర్కొన్నారు. గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్‌బానో కేసులో గుజరాత్ ప్రభుత్వం శిక్ష కుదించి విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ తీర్పు పట్ల సంఘీభావం తెలుపుతూ న్యాయవాది గోరంట్ల నారాయణ, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం.రాధాకృష్ణ, మాదాసు భానుప్రసాద్, అబ్బాస్‌ఖాన్ పాల్గొన్నారు.

మద్యం కేసులో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో అధికారులు

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 135 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, ఎస్‌ఐ సురేంద్ర బాబు ఆదివారం తెలిపారు. సత్తెనపల్లి రోడ్డు వినాయకుని గుడి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా గుత్తికొండ గ్రామానికి చెందిన జరపాల చంటీనాయక్ ద్విచక్రవాహనంపై అక్రమంగా గోవా రాష్ట్ర మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లతో పాటు అక్రమ రవాణాకు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో మరో నిందితుడు సంతమాగులూరు మండలం తంగేడుమల్లి గ్రామానికి చెందిన గట్టుపల్లి కిరణ్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

నాదెండ్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పేద వృద్ధురాలు పంచుమర్తి హేమలత కుటుంబానికి గణపవరం హెల్పింగ్ హ్యాండ్స్ చేయూతనిచ్చింది. ఈ మేరకు ఆదివారం గణపవరంలోని చవిటిపాలెంలో వారి గృహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.



వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణానికి హాజరైన మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండప ప్రాంగణంలోని శ్రీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణమహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు హాజరయ్యారు. అమ్మవారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు వేణుగోపాలస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎడ్లపాటి లక్ష్మీనారాయణ, సావిత్రి దంపతుల పీటలపై కూర్చున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు.

సొలసలో..

యడ్లపాడు: మండలంలోని సొలసలోని శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవాలయంలో ధనుర్మాసం చివరి రోజైన ఆదివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మకర్తలు అర్వపల్లి మనో హర్, నాగజ్యోతి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి సారెతో వీధుల్లో ఊరేగింపు చేశారు.

ఉన్నవలో..

యడ్లపాడు: మండలంలోని ఉన్నవలోని పురాతనమైన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి శాంతి కల్యాణం నిర్వహించారు.

వినుకొండ(నూజెండ్ల): ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో చిన్నజీయరు స్వామి నిలయం నిర్వాహకులు భవనాసి మల్లికాప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో గోదా రంగనాథ కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సతీమణి ఆదిలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సందడిగా సంక్రాంతి క్రీడాపోటీలు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో సంక్రాంతి సాంస్కృతిక, క్రీడా పోటీలు ఆదివారం నిర్వహించారు. ఉదయం వాల్కతాన్(దూర నడక) పోటీలో గ్రామంలోని వంద మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో వాలీబాల్, షటిల్ ఫైనల్స్ పోటీలు ముగిశాయి. క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ నేతృత్వంలో గ్రామంలోని పదిమంది మహిళలకు స్వయం ఉపాధి కింద కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయరాజు పాల్గొని ఇప్పటి వరకు జరిగిన ఈవెంట్ విజేతలకు బహుమతుల్ని అందజేశారు. ఆయా కార్యక్రమాలను డీవైఎఫ్ఐ ప్రతినిధులు జి.లెనిన్, ఆర్.సుమన్, కె.గోపి, ఆర్.సురేష్, రామోజీలు సహకరించగా, ఆర్గనైజింగ్ కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



లింగారావుపాలెంలో వాలీబాల్ ఫైనల్స్ ఆడుతున్న క్రీడాకారులు

ఫెండ్స్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

శావల్యాపురం: సంక్రాంతి సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫెండ్స్ యూత్ కమిటీ నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. 10 టీమ్స్ పాల్గొన్నగా మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు.

కార్యక్రమంలో సర్పంచి యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యులు డి.హుస్సేన్, కె.ఫణీంద్ర, జె.బాబు, రవి, ఏరుకలరెడ్డి, బి.వీర రాఘవయ్య, సీహెచ్ చౌదరి, కె. శ్రీనివాసరావు, పి.శ్రీను, కె.వేంకటేశ్వర్లు, బాలకృష్ణ, తోట ప్రసన్నాంజనేయులు, రంజాన్‌వలి పాల్గొన్నారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

నాదెండ్ల: సాతులూరు, గణపవరం గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సాతులూరు గ్రామ దేవతల ఆలయం వద్ద జరిగిన ముగ్గుల పోటీల్లో హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందించారు. జెడ్పీ హైస్కూలులో జరిగిన క్రికెట్ పోటీల్లో సాతులూరుకు చెందిన జట్టుకు ప్రథమ స్థానం లభించింది. అనంతరం మహిళల మ్యూజికల్ చైర్స్, స్లోసైకిల్, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి న్యాయవాది శ్రీనివాసరావు బహుమతులు అందించారు. గణపవరం కోదండ రామాలయంలో కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బహుమతులను మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ సూరా శంకరరెడ్డి, కమిటీ సభ్యులు ఐతా శ్రీనివాసరావు, పాందూరి వెంకటేశ్వరరావు, బొంతు కుమార్, అనిల్, కాటా వెంకటేశ్వర్లు అందించారు.

నేడు యడ్లపాడులో సంక్రాంతి క్రీడా పోటీలు



యడ్లపాడు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల మహిళలకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పుడమి గ్రూప్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ వారం మధ్యాహ్నం 2 గంటలకు రచ్చబండ సెంటర్లో రంగవల్లుల పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. మ్యూజికల్ చైర్స్, మోకులాడుడు, కుండకొట్టుట, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించి ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

దుస్తులు పంపిణీ

చిలకలూరిపేట: ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను పట్టణంలోని విజ్ఞాన్ విహార్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది పేద బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన వారికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు చల్లా విజయకుమార్, ఏకా మారుతీశర్మ, రామచంద్రమౌళి, వారణాసి శరత్, ధూళిపాళ పద్మావతి, లలితకుమారి, హరిత పాల్గొన్నారు.